'నోరుముయ్యి' అరిచాడు ఆఫీసర్. 'బయట కూచుని గంట కొట్టినప్పుడు వెంటనే రా.'

కోటయ్య బయట కూర్చున్నాడు. ప్రతి అయిదు నిమిషాలకీ, పదినిమిషాలకీ గంట కొట్టి ఏవో పనులు పురమాయించాడు ఆఫీసర్. గంట విన్నప్పుడల్లా కోటయ్యకి ఆత్మాభిమానం దెబ్బ తినేది. 'పేరుపెట్టి పిలవలేడూ. ఈ గంట కొట్టట మేమిటీ? ఇంతకంటే 'కోటాయ్' అన్న పేరే నయం' అనుకున్నాడు కోటయ్య. ఆగంట కొట్టటంలో ఆఫీసర్ పొందే ఆత్మతృప్తి, ఆనందం, స్వాతిశయం కోటయ్య కేం తెలుసు!

మధ్యాహ్నమయింది. కోటయ్య భోజనానికి ఇంటికొచ్చాడు. ఇంటికి రాగానే ఏమిటో, అంతా కొత్తగా ఉందతనికి. తను మునుపటి కోటయ్యకాదు. జవాను కోటయ్య! ఇంట్లోని ప్రతివస్తువూ అతన్ని గేలి చేస్తున్నట్టుంది; ప్రతిదీ చులకనగా తనవైపు చూస్తున్నట్టుంది.

'వేణ్ణీళ్లు ఉన్నయ్యా?' స్నానంచేసి బడలిక తీర్చుకుందామని అడిగాడు కోటయ్య.

లేవని బుర్ర తిప్పింది రత్తమ్మ.

'ఏం?' అన్నాడు కోటయ్య కొంచెం కోపంతో.

'పుల్లల్లేవు' అంది రత్తమ్మ మామూలు ధోరణిలో.

'ఏరుకురాలేే?'

'యాడేరుకొచ్చేది?'

'రోజూ యాడేరుకొస్తుండవు?'

రత్తమ్మ మాట్లాడలేదు. కోటయ్యకి కోపం వచ్చింది. రత్తమ్మకి తనంటే బొత్తిగా నిర్లక్ష్యం. గబగబ నోటికి వచ్చినట్లు నాలుగు చీవాట్లు పెడదామనుకున్నాడు గాని, మళ్లీ తమాయించుకున్నాడు. ఇంతకీ రత్తమ్మ ఏమన్నదని? అమ్మగారు, ఆఫీసరుగారు తనని పెట్టిన చీవాట్లు తలపుకొచ్చాయి అతనికి. వాళ్లంతంత లేసి మాటలంటూంటే ఏమీ అనలేని తను రత్తమ్మ మీద మాత్రం ఎందుకు కలుగజేసుకోవాలి! అయినా తను ఒక సామాన్య బంట్రోతు. కోపం, గీపం తన దగ్గరికి రావటానికి వీల్లేదు. ఒకళ్లు తనని ఏమైనా అనాలిసిందేగాని, తను ఎవరినీ ఏమీ అనకూడదు. రత్తమ్మ మాత్రం తను చేసే మహా ఘనమైన ఉద్యోగానికి ఏమంత గౌరవం చూపిస్తుంది. అయితే, తను ఈ ఉద్యోగం చెయ్యటం వాళ్ళకోసమేగా. వాళ్లకోసం తను అవమానం సహిస్తున్నాడు. సహించాలి. కేవలం అందుకోసమైనా తనవాళ్ళు తనమీద గౌరవాదరాలు చూపించొద్దూ.

'ఏందా ఆలోశన?' అంది రత్తమ్మ, కోటయ్య వైఖరి చూసి.

'ఏం లేదు.'

'నే నెంత చెప్పినా ఇనక ఆ నౌకరిలో చేరితివి. అల్లేమైనా అన్నారేంటి?'

'ఏహె, లేదులే' అన్నాడు కోటయ్య కోపంగా.

'బువ్వ తాగుదుగాని పద, మళ్ళా నౌకరి కెళ్ళాలి గామాలె' అంది రత్తమ్మ కొంచెం ఊసడింపుగా.

'నేను జమాను నౌకరి చేస్తే నీకేం కష్టం?' అన్నాడు కోటయ్య చిరాగ్గా.

'కష్టంలేదు, నష్టంలేదులే సా' అంది రత్తమ్మ.

'మరి బువ్వెట్టా వొచ్చుద్ది?' అన్నాడు కోటయ్య. రత్తమ్మ గొంతులోని వ్యంగ్యం పెడుతున్న బాధని ఓర్చుకుంటూ. రత్తమ్మ మాట్లాడలేదు. తను బంట్రోతుగా పనిచెయ్యటం రత్తమ్మకీ, ఇంట్లో అందరికీ కూడా అవమానకరంగా ఉందని కోటయ్య గ్రహించాడు. కాని, తనేం చెయ్యగలడు. పోషించాల్సిన బాధ్యత తనది. ఇంకే ఉద్యోగం దొరికినా ఇది విడిచి తక్షణం దాంట్లో చేరటానికి తను సంసిద్ధుడే. కాని ఇచ్చే వాడెవడు?



